క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సునీల్

తుర్కయంజాల్: దశలవారీగా వార్డులో అభివృద్ధి పనులు చేపడగామని కౌన్సిలర్ కాకుమాను సునీల్ తెలిపారు. కమ్మగూడలోని వశిష్ఠ ఎన్క్లేవ్‌లో రూ.13లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కవాలన్నారు. స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దండుమైలారం పీఏసీఎస్‌కు ఉత్తమ అవార్డు



వెంకట్‌రెడ్డిని సన్మానించిన అతిథులు

ఇబ్రహీంపట్నం: రుణాలను సకాలంలో వసూలు చేసినందుకు గాను దండుమైలారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఉత్తమ అవార్డు దక్కినట్లు చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య.. రుణాల వసూళ్లల్లో తమ పీఏసీఎస్‌కు ఉత్తమ అవార్డును అందజేసి సన్మానించినట్లు వెంకటరెడ్డి వెల్లడించారు. 1000 గజాల స్థలాన్ని సేకరించడంతో పాటు సంఘం భవనాన్ని, గోదామును నిర్మించడం, రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు సకాలంలో తిరిగి వసూల్ చేయడంలో తమ సంఘం ముందువరుసలో ఉందని వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని రాంపూర్‌లో ఈదమ్మ ఆలయ నిర్మాణం కోసం బుధవారం ఆయన ట్రస్టు సభ్యుల ద్వారా.. స్టీల్, సిమెంట్, ఇటుక తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, జానయ్య, యాదయ్య, ఆంజనేయులు, పెంటయ్య, జంగయ్య, నర్సింహ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంట సాగుపై అవగాహన

ఆమనగల్లు: మండలంలోని కోనాపూర్‌లో బుధవారం వ్యవసాయ శాఖ సహకారంతో జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పత్తి పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్ భూసార పరీక్ష, ప్రాముఖ్యత, అధిక సాంద్రత పత్తిసాగు పద్ధతి గురించి వివరించారు. పశుపోషణ, పశుగ్రాసం సాగు తదితర అంశాలపై డా.సుదీర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఆదిలక్ష్మి, వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓలు మీనాక్షి, రాణి, శివతేజ, సాయిరాం, వివిధ పత్తి విత్తనాల కంపెనీల ప్రతినిధులు సూర్యప్రకాశ్, కల్యాణ్, కిరణ్ కుమార్‌రెడ్డి, రాఘవరెడ్డి, రంగారెడ్డి, దిలీప్, హారిక, సుమీత్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు యువకుడికి గాయాలు

తలకొండపల్లి: పిడుగు పాటుకు గురై ఓ యువకుడు గాయపడిన సంఘటన రాంపూర్‌లో చోటు చోటు చేసుకుంది. వివరాలు.. రాంపూర్‌కి చెందిన ప్రవీణ్(22) గ్రామ శివారులో బుధవారం సాయంత్రం గొర్లు మేపుతున్నాడు. అదేసమయంలో వర్షంతో పాటు పిడుగు పడింది. దీంతో ప్రవీణ్ కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం అతడిని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

మంచాల: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆరుట్ల ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ అన్నారు. అనారోగ్యానికి గురై నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుట్లకి చెందినఅంజయ్య కూతురు వనజకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి పథకం ద్వారా మంజూరైన రూ.2,50,000 ఎల్‌ఓసీని శ్రీనివాస్ బుధవారం అందజేశారు. నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పండరీనాథ్, యాదయ్య కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భాషయ్య, కార్యదర్శి రమేష్, స్థానిక నాయకులు.. చంద్రయ్య, సురేష్ రాజుగౌడ్, ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టరూ..

- అధ్వానంగా ఎక్వాయిపల్లి – చరికొండ రహదారి
- కంకర తేలడంతో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కంకర తేలిన ఎక్వాయిపల్లి-చరికొండ రోడ్డు

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లి నుంచి చరికొండ వెళ్లే రహదారిపై గోతలు పడటంతో పాటు కంకర తేలి ప్రమాదకరంగా తయారయింది. రోడ్డు కోతకు గురై ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డు మీదుగా కడ్తాల్, ఆమనగల్లు, మాల్, నాగిళ్ల, కొలుకులపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యేకించి మండల పరిధిలోని ప్రయాణికులు నల్లగొండ జిల్లా మాల్ తదితర ప్రాంతాలకు ప్రయాణించేందుకు దూరం తక్కువ కావడంతో ఈ రహదారినే ఎంచుకుంటారు. ఈ విషయమై ఏడాది క్రితం అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా రోడ్డు అభివృద్ధి పనుల కోసం రూ.2.05 కోట్లు కేటాయించడంతో పాటు శంకుస్థాపన కూడా చేశారు. శంకుస్థాపన చేసి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి పనులను ప్రారంభించలేదు. దీంతో ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం ప్రమాదాలు..

ఎక్వాయిపల్లి, కిష్టారాంపల్లి, ముద్విన్, చరికొండ మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఈ రోడ్డంటేనే జంకుతున్నారు. రాత్రివేళ రహదారి మీదుగా రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిందే. రోడ్డు కోతకు గురవ్వడంతో ఇప్పటికే ఇక్కడ అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పెరిగిన ట్రాఫిక్‌కు అనుకూలంగా ఈ రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



ఎక్వాయిపల్లి-చరికొండ రోడ్డుపై గుంతలు పడటంతో పాటు కోతకు గురవ్వడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎదురుగా వాహనం వస్తుందంటే రోడ్డు దిగాల్సిందే. అధికారులు స్పందించి నూతన రోడ్డు వేయాలి.

– సుమన్, ఎక్వాయిపల్లి

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



గోతులు పడటంతో ఎక్వాయిపల్లి-చరికొండ రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు గుండా వాహనదారులు రాకపోకలు సాగించాలంటే జంకుతున్నారు. శంకుస్థాపన చేసి 9 నెలలు గడిచినా పనులు ప్రారంభించలేదు. వెంటనే పనులను ప్రారంభించాలి.

– మల్లేశ్, మర్రిపల్లి

త్వరలో పనులు ప్రారంభిస్తాం



ఎక్వాయిపల్లి-చరికొండ రోడ్డు అభివృద్ధి పనులకు ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. సమస్యను ఎమ్మెల్యేతో పాటు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వీలైనంత త్వరగా రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

– పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



స్వచ్ఛ ఆదిబట్ల కార్యక్రమంలో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వచ్ఛ ఆదిబట్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో పదిరోజుల పాటు ప్రతిరోజు ఉదయం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషిచేస్తామన్నారు. పట్టణంలోని శ్మశాన వాటికకు నిధులు కేటాయించామని తెలిపారు. ముందుగా మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను జేసీబీ సహకారంతో కూల్చివేయించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, కమిషనర్ బాలకృష్ణ, డీఈ శిల్ప, గ్రామస్తులు.. సాంబయ్య గౌడ్, రాజు, పాండురంగారెడ్డి, సాయిబాబగౌడ్, రజినీకాంత్‌గౌడ్, నర్సింహ, వెంకటయ్య, కృష్ణ, శ్రీకాంత్ తదదితరులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి

- సీఐ శంకర్‌కుమార్



యాచారం: ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

యాచారం: డ్రగ్స్ తీసుకున్నా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని యాచారం సీఐ శంకర్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయి తీసుకునే వారి జీవితాలు నాశనమవుతాయని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడితే వారి బంగారు భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. గంజాయి క్రయ, విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాల బారిన పడొద్దు..

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాజీ ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రావు సూచించారు. ఆదిబట్ల మున్సి పాలిటీ కొంగరకలాన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల మాజీ చైర్మన్ సునీతారెడ్డి, వీరస్వామిగౌడ్, రవీందర్, గోపగల్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మల్లురవికి సత్కారం



మల్లు రవిని సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడిగా డా.మల్లురవి ప్రమాణస్వీకారం చేసిన అనంతరం.. మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌నాయకులు ఆయనను బుధవారం న్యూఢిల్లీలో కలిసి ఘనంగా సత్కరించారు. మల్లురవితో కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఆమనగల్లు అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవులు, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు రవీందర్ నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, ఆమనగల్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.

పిల్లల పెరుగుదలపై పర్యవేక్షణ తప్పనిసరి

- సీడీపీఓ శాంతిశ్రీ



చిన్నారి బరువును కొలుస్తున్న అధికారులు

మంచాల: ఐదు సంవత్సరాల్లోపు పిల్లల ఎదుగుదలను తప్పనిసరిగా పర్యవేక్షించాలని సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పిల్లల ఎదుగుదల వివరాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పుట్టిన పాప నుంచి మొదలుకొని ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా ఎదుగుదల పరీక్షలు చేయించాలన్నారు. అప్పుడే వారి ఆరోగ్యం విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు. అతి తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవడంతో పాటు పిల్లలకు సూచనలు ఇవ్వవచ్చన్నారు. ప్రధానంగా నేషనల్ ఫ్యామిలీ హెల్త్ డేటా ప్రకారం పిల్లల ఆరోగ్య విషయాలను పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజార్ కల్పన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల్లో బోరుబావుల తవ్వకం

యాచారం: జల జీవన్ మిషన్ పథకం కింద తాడిపర్తిలోని పల్లె ప్రకృతి వనంలో బుధవారం బోరుబావిని తవ్వించారు. ఏడాది కింద మాజీ సర్పంచ్ దూస రమేష్ తన పదవీ కాలంలో జల జీవన్ మిషన్ కింద బోరుబావి కోసం ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టాడు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో బుధవారం బోరుబావిని తవ్వించారు. అదే విధంగా గునుగల్ గ్రామంలో కూడా బోరుబావిని తవ్వించారు. అలాగే శశ్మానవాటికలో బోరుబావిని తవ్వించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- సీఐ ప్రమోద్‌కుమార్



కడ్తాల్: జయరాములును సన్మానించిన సిబ్బంది



ఆమనగల్లు: ఎస్ఐ బల్‌రాంను సన్మానించిన నేతలు

ఆమనగల్లు: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు పీఎస్ ఎస్ఐగా పనిచేస్తూ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీసు స్టేషన్‌కు బదిలీ అయిన బల్‌రాంను బుధవారం ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్, ఏఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు ఎస్ఐగా బల్‌రాం అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఎస్ఐ బాల్‌రాంను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, అలీం, శ్రీశైలం, ప్రసాద్, మైసయ్య, ప్రసాద్, మహేశ్, అశోక్, కరీం, ఫిరోజ్, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, బీఆర్ఎస్ నా యకులు.. రాములు, వెంకటేశ్, రమేశ్, యాదయ్య, ఆనంద్, గణేశ్, శేఖర్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజం..

కడ్తాల్: విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని సీఐ శివప్రసాద్ అన్నారు. విధి నిర్వహణలో బదిలీలు సహజం అన్నారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు న్న జయరాములు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ శివప్రసాద్‌తో పాటు, పోలీస్ సిబ్బంది జయరాములును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాద్‌జీ, హెడ్ కానిస్టేబుళ్లు మల్లయ్య, దశరథం, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం మేనేజర్‌ను తొలగించాలి

- చైర్మన్‌తో సహా ఏడుగురు డైరెక్టర్ల తీర్మానం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్‌ను విధుల నుంచి తొలగించాలంటూ సంఘం చైర్మన్‌తో సహా మెజారిటీ డైరెక్టర్లు తీర్మానం చేశారు. బుధవారం సంఘం కార్యాయంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సంఘం బ్రాంచి కార్యాలయం ఆవరణలో ఉన్న గదులు అద్దెకు ఇచ్చే విషయంలో ఏకపక్ష నిర్ణయం, రుణం కోసం వచ్చే రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవాడని పాలకవర్గం దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ తీర్మానం చేసినట్లు పలువురు వెల్లడించారు. మేనేజర్ తీరుతో సంఘానికి చెడ్డ పేరు వస్తుందని, తక్షణమే అతన్ని విధుల నుంచి తొలగించాలనే తీర్మానం ప్రతిని జిల్లా సహకార అధికారులకు అందజేసినట్లు సమాచారం. ఐలేష్‌ను తొలగించడంతో పాటు అక్రమాలు చేసినట్లు రుజువైనందున చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ చేసిన తీర్మాన పత్రంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్, డైరెక్టర్లు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, పగిళ్ల బాల్‌రెడ్డి, బిజిలీ బాలనర్సింహ, చింతల లక్ష్మమ్మ, కందాడి మహిపాల్‌రెడ్డి, ఇటుకల మహేందర్‌రెడ్డి, గంటా శ్రీనివాస్‌రెడ్డిలు సంతకాలు చేసినట్లు సమాచారం. త్వరగా తొలగింపు ప్రక్రియ చేపట్టాలని వారు కోరారు

పాఠశాలల బంద్ ప్రశాంతం

ఏబీవీపీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో బుధవారం పాఠశాలల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలనే డిమాండ్లతో ఏబీవీపీ నాయకులు చేపట్టిన బంద్‌కు అనూహ్య స్పందన లభించింది. గ్రామాల్లో, పట్టణాల్లో పలు పతశాలలు స్వచ్ఛందగా బంద్‌కు సహకరించగా.. మరికొన్నిచోట్ల తెరిచిఉన్న పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసివేయించారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు



యాచారం: పాఠశాలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ శ్రేణులు



వనస్థలిపురం: నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు



మాడ్గుల: ఇన్‌చార్జి ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఆమనగల్లు: విద్యార్థులతో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు